సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 13 | డిసెంబర్ | 2024



ఇంటి వద్దనే జీవన ధ్రువీకరణ పత్రం!

విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల వద్దకు తపాలా సిబ్బంది వెళ్లి డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. - 8లో▸



వేసవిలో వినియోగదారులకు ఇబ్బందులు కలగొద్దు

వేసవిలో విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ సూచించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $29^0/17^0$

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

అక్టోబర్ @ 144

కమిషనరేట్ పరిధిలో అత్యధిక ప్రమాదాలు

- 11 నెలల్లో 1,305 యాక్సిడెంట్లు
- 410 మంది మృత్యువాత.. క్షతగాత్రులు 1,264 మంది
- డిసెంబర్‌లో పొగమంచుతో మరిన్ని ప్రమాదాలకు ఆస్కారం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

సాక్షి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి రోడ్లు రక్తసిక్తం అవుతున్నాయి. జనవరి నుంచి నవంబర్ వరకు 1,305 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. అత్యధికంగా అక్టోబర్‌లో 144 యాక్సిడెంట్లు అయ్యాయి. అత్యల్పంగా 73 రోడ్డు ప్రమాదాలు సెప్టెంబర్‌లో జరిగినట్లు ట్రాఫిక్ గణాంకాలు చెబుతున్నాయి. 11 నెలల్లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో 410 మంది మృత్యువాత పడగా.. 1,264 మంది క్షతగాత్రులయ్యారు. ప్రస్తుత నెల డిసెంబర్‌లో చలి తీవ్రత పెరుగుతుండడం.. అదేసమయంలో తెల్లవారుజామున పొగమంచు కురిసే అవకాశం ఉండడంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో కొన్నిచోట్ల గుంతలతో ప్రమాదం పొంచి ఉంది.. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డెక్కే వాహనాలు లైట్లు వేసుకోవాలని, అప్రమత్తతతో డ్రైవింగ్ చేయాలని కోరుతున్నారు.



ప్రమాదాలకు కారణాలివే..

హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగం, డ్రంకన్ డ్రైవ్, నిద్రమత్తు, రోడ్లు గుంతలుగా ఉండడం, వీధిలైట్లు, ట్రాఫిక్ సిగ్నళ్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్, రివర్స్‌లో వెళ్లడం, మలుపుల్లో ఓవర్ టేక్, మైనర్లు డ్రైవింగ్ చేయడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా కారణమవుతున్నాయి.



అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి..

వాహనాలు డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు తగ్గుతాయి. అతివేగం, డ్రంకన్ డ్రైవ్ వల్లే ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల ఇంజనీరింగ్ లోపంతోనూ యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. అందుకే కమిషనరేట్ పరిధిలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే హాట్‌స్పాట్లను గుర్తించి సంబంధిత విభాగంతో కలిసి మరమ్మతులు చేసే దిశగా ఆదేశాలిస్తున్నాం. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి వాహనదారులు జాగ్రత్తగా ఇంటికి చేరుకోవాలి. - అంబర్ కిశోర్ ఝా, సీపీ

హాట్‌స్పాట్లు ఎక్కడంటే..

- వరంగల్, హనుమకొండ, జనగామలోని అంతర్గత రహదారులతో పాటు నేషనల్ హైవేలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రాఘవాపూర్ క్రాస్, ఛాగల్, ఘన్‌పూర్ బస్టాండ్, చిల్పూరుగుట్ట క్రాస్ నుంచి ఎల్లమ్మగుడి వరకు, చిన్నపెండ్యాల, పెద్ద పెండ్యాల, కరుణాపురం, ఔటర్ ఎంట్రెన్స్, ఔటర్ రోడ్డుపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- గంగదేవిపల్లి, కొమ్మాల, విశ్వనాథపురం
- వరంగల్ నాయుడుపెట్రోల్ పంపు, రిలయన్స్ పెట్రోల్ బంకు, మామునూరు ఫోర్త్ బెటాలియన్ గేట్ సమీపం, మామునూరు చెరువుకట్ట, రామకిష్టాపురం, బొల్లికుంట క్రాస్‌రోడ్డు, ఇల్లంద
- దామెర క్రాస్‌రోడ్డు, ఊరుగొండ, గూడెప్పాడ్ క్రాస్‌రోడ్డు.
- హసన్‌పర్తి మార్గంలో దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర కేయూసీ క్రాస్ రోడ్డు నుంచి బావుపేట వరకు ఉన్న రహదారి ప్రమాదకరంగా మారింది. బావుపేట క్రాస్, హసన్‌పర్తి పెద్ద చెరువు క్రాస్, హసన్‌పర్తి సెంటర్ నుంచి ఎల్లమ్మ గుడి వరకు, నల్లగట్టు నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాస్, ఎర్రగట్టుగుట్ట క్రాస్ నుంచి రామారం వరకు ప్రమాదాలకు హాట్‌స్పాట్‌గా మారాయి.

నెల	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబర్	అక్టోబర్	నవంబర్	మొత్తం
రోడ్డు ప్రమాదాలు	117	126	126	141	106	117	92	129	73	144	134	1,305
మృతులు	43	45	32	50	39	29	28	49	73	41	41	410
క్షతగాత్రులు	149	108	134	142	95	100	82	117	92	123	122	1,264

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఈనెల 16 వరకు గడువు పొడిగించినట్లు.. ఇదే చివరి అవకాశం అని హనుమకొండ డీఈఓ వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ అనగోని సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలల్లోనూ సంప్రదించాలని పేర్కొన్నారు. అధ్యయన కేంద్రాల్లో ధ్రువపత్రాలు సమర్పించి అడ్మిషన్ ఫామ్ పొంది అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నమోదు చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులే స్వయంగా అడ్మిషన్ల ఫీజును డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫామ్ ప్రింటవుట్‌ను ఈనెల 17న సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ అనగోని సదానందం 93460 20003, 93963 37572 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేయూ ఎంసీఏ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 19 నుంచి నిర్వహించేందుకు పరీక్షల విభాగాధికారులు టైంటేబుల్ విడుదల చేశారు. గురువారం ఆయా విద్యార్థులు తమకు ఇతర పోటీ పరీక్షలున్నాయని వాయిదా వేయాలని పరీక్షల విభాగాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయా పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్యులు కె.రాజేందర్ తెలిపారు. మళ్లీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తామనేది తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

సీపీని కలిసిన ఏసీపీ



వరంగల్ క్రైం : వరంగల్ కమిషనరేట్ హోమ్ గార్డ్స్ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కె.నాగయ్య గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

నేడు కాజీపేటలో రైల్వే జీఎం పర్యటన

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పర్యటించనున్నట్లు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి జీఎం ప్రత్యేక రైల్లో బయల్దేరి కాజీపేట జంక్షన్‌కు మధ్యాహ్నం 1:30 గంటలకు చేరుకుంటారు. అనంతరం జీఎం కాజీపేట జంక్షన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ నిర్మాణ పనులను, ఇతర కార్యాలయాలను తనిఖీ చేసి కాజీపేట జంక్షన్ అభివృద్ధిపై రైల్వే అధికారులతో చర్చిస్తారు. అనంతరం అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న కాజీపేట రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణ పనుల వద్దకు వెళ్లి జీఎం తనిఖీ చేసి అధికారులతో మాట్లాడి వ్యాగన్ పనుల వివరాలు తెలుసుకుంటారని రైల్వే అధికారులు తెలిపారు.

మార్గం సుగమం

నగర రోడ్లకు మహర్దశ

- 2041– మాస్టర్ ప్లాన్‌లో కొత్త రహదారులు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు

వరంగల్ అర్బన్ : తెలంగాణ రెండో రాజధాని చారిత్రక ఓరుగల్లును నవ్య నగరంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమమైంది. భవిష్యత్ అవసరాల కోసం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) రూపొందించిన మాస్టర్ ప్లాన్‌తో ముఖచిత్రం మారిపోనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)2041 రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోద ముద్ర వేసింది. దీంతో వరంగల్ నగరంలో రాచబాటలుగా మారనున్నాయి. ఇరుకు రహదారుల్లో కిక్కిరిసిన వాహనాలతో రద్దీగా మారిన ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి లభించడంతో అభివృద్ధి ఊపందుకోనుంది.

విశాలమైన రహదారులు

చారిత్రక, పర్యాటక, సాంస్కృతిక, విద్య, వైద్యం పరంగా వరంగల్ ఖ్యాతి గడించింది. 1972 సంవత్సరం నాటి పట్టణ రహదారులున్నాయి. అప్పటి జనాభా అవసరాలకు తగ్గట్టుగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ గత మూడేళ్ల వరకు అమలైంది. 2041 భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వసతుల కల్పనకు బృహత్తర ప్రణాళికలో పెద్ద పీటవేశారు. ఈ మాస్టర్ ప్లాన్ అమలైతే నగరాన్ని దీర్ఘకాలికంగా పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ముఖ్యమైన రహదారులు, జంక్షన్ల విస్తరణపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లకు రహదారుల విస్తరణతో వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. 17 ఏళ్ల ముందు చూపుతో ఆమోదం పొందిన కొత్త మాస్టర్ ప్లాన్‌లో రోడ్ల విస్తరణ వ్యూహం ఖరారైంది.

అవసరాలకు తగ్గట్టుగానే.. ఇప్పట్లో కూల్చివేతలు లేవు

మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదిత రహదారులకు అనుగుణంగా రెసిడెన్షియల్, కమర్షియల్, పరిశ్రమలకు సంబంధించిన భవన నిర్మాణ ధ్రువీకరణ అనుమతులను బల్దియా జారీ చేస్తోంది. గత పదిహేను సంవత్సరాలుగా మాస్టర్ ప్లాన్‌పై తర్జనభర్జన తర్వాత ప్లాన్‌కు ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ముందస్తుగా గ్రేటర్ వరంగల్ ముసాయిదా పరిగణనలోకి తీసుకుంది. ఆ మేరకు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారు. ఇప్పట్లో మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చిన విధంగా విస్తరణ లేదు. కానీ, భవిష్యత్‌లో అవసరాలకు తగ్గట్టుగా విస్తరణలో భాగంగా కూల్చివేతలు చేపట్టనున్నారు. అందువల్ల భవన యాజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

80 నుంచి 100 ఫీట్లుగా..

- వరంగల్ ఎంజీఎం నుంచి పాపయ్యపేట చమన్, బట్టలబజార్ ఫ్లైఓవర్ నుంచి కరీమాబాద్, ఉర్సు మీదుగా రంగశాయిపేట వరకు రోడ్డు 80 ఫీట్లు ఉండగా, దీన్ని 100 ఫీట్లుగా అభివృద్ధి చేయనున్నారు.
- వరంగల్ ఫోర్ట్ రోడ్డు నుంచి శివనగర్, ఏసీరెడ్డి నగర్ మీదుగా చింతల్ బ్రిడ్జి వరకు 80 ఫీట్లు ఉండగా దీన్ని 100 ఫీట్లుగా విస్తరించనున్నారు.
- వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి మండిబజార్, జేపీఎన్ రోడ్డు, చౌరస్తా, హెడ్‌పోస్టాఫీస్ నుంచి ఆర్టీసీ, రైల్వే స్టేషన్ వరకు ప్రస్తుతం 80 ఫీట్ల రోడ్డు ఉంది. దీన్ని 100 ఫీట్ల రోడ్డుగా విస్తరించనున్నారు.
- వరంగల్ ఎంజీఎం నుంచి పోతన, హంటర్ రోడ్డు వరకు ప్రస్తుతం 80 ఫీట్లు ఉంది. దీన్ని 100 ఫీట్లకు విస్తరణ జరగనుంది.
- వరంగల్ అండర్ బ్రిడ్జి నుంచి ఖమ్మం ఫోర్ట్ రోడ్డు మీదుగా నాయుడు పెట్రోల్ పంపు వరకు ప్రస్తుతం 80 ఫీట్లు ఉండగా.. ఆ రోడ్డును 100 ఫీట్లుగా వెడల్పు చేయనున్నారు.
- పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేట, పైడిపల్లి మీదుగా ఆరెపల్లి వరకు 100 ఫీట్లుగా విస్తరించనున్నారు.
- కాశిబుగ్గ జంక్షన్ నుంచి ఏనుమాముల మీదుగా వ్యవసాయ మార్కెట్ వరకు 100 అడుగుల రోడ్డుగా మారనుంది.
- ఖిలా వరంగల్‌ఫోర్ట్ రోడ్డు నుంచి ఏసిరెడ్డినగర్ మీదుగా చింతల్ బ్రిడ్జి మిల్స్ కాలనీ జంక్షన్ వరకు 100 ఫీట్ల రోడ్డు.
- హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ నుంచి ప్రకాశ్ రెడ్డి మీదుగా న్యూశాయంపేట రైల్వే గేట్ వరకు ప్రస్తుతం 80 ఫీట్లు ఉండగా.. 100 ఫీట్ల వరకు విస్తరించనున్నారు.
- హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం నుంచి లోకల్ డిపో మీదుగా ఎన్‌జీఓస్ కాలనీ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు 80 ఫీట్ల రోడ్డును 100 ఫీట్ల రోడ్డుగా విస్తరించనున్నారు.
- హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు 100 ఫీట్లుగా అభివృద్ధి చేయనున్నారు.



అభివృద్ధి కానున్న వరంగల్‌లోని ఉర్సుగుట్ట జంక్షన్



వరంగల్ లేబర్ కాలనీ-నర్సంపేట రోడ్డు

100 నుంచి 150ఫీట్ల రహదారులు ఇవే..

- రాంపూర్ నుంచి మడికొండ, కాజీపేట, ఫాతిమానగర్, నిట్, సుబేదారి, అదాలత్, నక్కలగుట్ట, అంబేడ్కర్ జంక్షన్, పబ్లిక్ గార్డెన్, హనుమకొండ చౌరస్తా, అలంకార్, ములుగు రోడ్డు, కేఎంసీ, ఎంజీఎం, గోపాలస్వామి టెంపుల్, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, వెంకట్రామ జంక్షన్, మిల్స్ కాలనీ, లేబర్ కాలనీ, ధర్మారం వరకు ప్రస్తుతం 100 ఫీట్ల రోడ్డు ఉంది. దీన్ని 150 ఫీట్లుగా విస్తరించనున్నారు.
- కడిపికొండ ఫ్లై ఓవర్ నుంచి భట్టుపల్లి మీదుగా ఉర్సుగుట్ట వరకు 100 ఫీట్ల నుంచి 150 ఫీట్లుగా వ్యూహం ఖరారు చేశారు.
- హనుమకొండ అదాలత్ నుంచి జూపార్కు, న్యూశాయంపేట హంటర్ రోడ్డు మీదుగా అండర్ బ్రిడ్జి వరకు ప్రస్తుతం 100 ఫీట్లు ఉంది. దీన్ని 150 ఫీట్లుగా విస్తరించనున్నారు.
- హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కరీంనగర్ రోడ్ హసన్‌పర్తి వరకు 100 ఫీట్ల నుంచి 150 ఫీట్ల వరకు విస్తరించనున్నారు.
- కాజీపేట ఫాతిమానగర్ నుంచి వడ్డేపల్లి చర్చి, కేయూసీ, పెద్దమ్మగడ్డ వరకు 100 ఫీట్ల రోడ్డు ఉండగా, దీనిని 150 ఫీట్లుగా అభివృద్ధి చేయనున్నారు.
- వరంగల్ హంటర్ రోడ్డు నుంచి సీఎస్‌ఆర్ గార్డెన్, రైల్వే ఫ్లై ఓవర్ మీదుగా ఉర్సుగుట్ట నుంచి నాయుడు పెట్రోల్ పంపు వరకు 100 ఫీట్ల రోడ్డు ఉంది. దీన్ని 150 ఫీట్లుగా విస్తరించి అభివృద్ధి చేయనున్నారు.
- వరంగల్ వ్యవసాయ మార్కెట్–1 గేట్ నుంచి అపర్ణ బిల్డర్స్ నుంచి గొర్రెకుంట పత్తి మిల్లుల నుంచి నర్సంపేట రోడ్డు వరకు 150 ఫీట్లుగా విస్తరణ జరగనుంది.

- కేయూ రోడ్డు నుంచి కోమటిపల్లి నుంచి దేవన్నపేట వరకు 100 ఫీట్లుగా అభివృద్ధి చేయనున్నారు.
- కాజీపేట జంక్షన్ నుంచి సామిడి రోడ్డు 60 ఫీట్ల నుంచి 80 వరకు విస్తరించనున్నారు.
- హనుమకొండ డీసీసీ భవన్ నుంచి కుమార్‌పల్లి మీదుగా పలు చోట్ల 20, 30 అడుగులు ఉండగా, 40 అడుగులకు విస్తరిస్తారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

హన్మకొండ అర్బన్: మహిళలు స్వశక్తితో ఎదగాలని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట్‌నారాయణగౌడ్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది విద్యార్థులకు గురువారం వారు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణగౌడ్ పుట్టినరోజు సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన కుట్టు శిక్షణ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి డ్రా ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి వారికి ఉచిత కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ ద్వారా పేద మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు.



కుట్టు మిషన్‌ను అందజేస్తున్న రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ వెంకట్‌నారాయణగౌడ్

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు జయశ్రీ, పుల్లూరి వేణుగోపాల్, టైలరింగ్ టీచర్ కంకణాల విజయ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాసంగి ప్రణాళిక ఖరారు

- 1,86,840 ఎకరాల్లో సాగు అంచనా
- గతేడాది 1,79,532 ఎకరాల్లో సాగు

హన్మకొండ: హనుమకొండ జిల్లా యాసంగి పంటల సాగు ప్రణాళిక ఖరారైంది. భూగర్భ జలాలు అందుబాటులో ఉండడంతో గతేడాదికంటే పంటల సాగు పెరుగుతుందనే అంచనాకు అధికారులు వచ్చారు. 2023–24 యాసంగిలో అన్ని పంటలు కలిపి 1,79,532 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుత (2024–25) యాసంగిలో 1,86,840 ఎకరాలుగా అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదైనా కుంటలు, చెరువుల్లోకి నీరు చేరి భూగర్భ జలాలు అందుబాటులో ఉండడంతో ఈసారి యాసంగి సాగు ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా భూగర్భజలాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. భూగర్భ జలాలు నవంబర్ నెల చివరి నాటికి సగటున 4.16 మీటర్ల వద్ద ఉన్నాయి. భూగర్భ జల మట్టం ఇలాగే నిలకడగా ఉంటే పంటల సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా..

భీమదేవరపల్లి మండలంలో అన్ని పంటలు కలిపి గతేడాది యాసంగిలో 16,756 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 17,575 ఎకరాల్లో చేయనున్నారు. ధర్మసాగర్‌లో గతేడాది 17,728 ఎకరాలు కాగా ఈ ఏడాది 17,965 ఎకరాలు, ఎల్కతుర్తి గతేడాది 17,697 ఎకరాలు.. ఈ ఏడాది 18,090 ఎకరాలు, హనుమకొండ గతేడాది 777 ఎకరాలు.. ఈ ఏడాది 820 ఎకరాలు, హసన్‌పర్తి గతేడాది 17,857 ఎకరాలు.. ఈ ఏడాది 18,620 ఎకరాలు, ఐనవోలు గతేడాది 21,287 ఎకరాలు.. ఈ ఏడాది 22,110 ఎకరాలు, కమలాపూర్ గతేడాది 23,035 ఎకరాలు, ఈ ఏడాది 23,590 ఎకరాలు, కాజీపేట గతేడాది 6,539 ఎకరాలు.. ఈ ఏడాది 7,020 ఎకరాలు, వేలేరు గతేడాది 12,616 ఎకరాలు.. ఈ ఏడాది 12,890 ఎకరాలు, ఆత్మకూరు గతేడాది 10,291 ఎకరాలు.. ఈ ఏడాది 11,060 ఎకరాలు, దామెర గతేడాది 10,597 ఎకరాలు.. ఈ ఏడాది 10,790 ఎకరాలు, నడికూడ గతేడాది 8,274 ఎకరాలు.. ఈ ఏడాది 8,870 ఎకరాలు, పరకాల గతేడాది 4,113 ఎకరాలు.. ఈ ఏడాది 4,930 ఎకరాలు, శాయంపేట గతేడాది 12,056 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుత యాసంగిలో 12,520 ఎకరాల్లో సాగు చేస్తారని ప్రణాళిక రూపొందించారు.



రేపు గురుకులాలు, హాస్టళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు

హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు

హన్మకొండ అర్బన్/వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన డైట్, కాస్మొటిక్ చార్జీలు ఈనెల 14వ తేదీ నుంచి అమల్లోకి రానున్న సందర్భంగా గురుకుల హాస్టళ్లలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద తెలిపారు. గురువారం కలెక్టరేట్లలో వివిధ శాఖల అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనేలా చూడాలన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

జిల్లాలో అటవీ భూముల సర్వే పకడ్బందీగా చేపట్టాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మసాగర్ మండలం ఇనుపరాతి గుట్ట పరిధిలో ఫారెస్ట్, పట్టా భూముల సర్వేపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలోని ఫారెస్ట్, పట్టాదారు భూముల వివరాలను సర్వే, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎఫ్‌ఓ లావణ్య, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



జాతీయ రహదారులు, సర్వీస్ రోడ్ల విషయమై ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 14వ తేదీన(శనివారం) జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కంపౌండబుల్, సివిల్, ఆస్తి, కుటుంబ, వైవాహిక, బ్యాంక్, విద్యుత్, చెక్ బౌన్స్, ఇన్సూరెన్స్, తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని వివరించారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు. న్యాయ శాఖ ఇచ్చిన ఈసదావకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీపడేట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎవరైనా తమ కేసుల్లో రాజీపడాలనుకున్నట్లయితే వారు పోలీస్ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

బేకరీలో 'కల్తీ' ఉత్పత్తులు

- 40 రకాల కాలం చెల్లిన పదార్థాలు
- స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం

హసన్‌పర్తి: నగర పరిధి 56వ డివిజన్ గోపాలపురంలోని ఓ బేకరీపై టాస్క్ ఫోర్స్ బృందం దాడి నిర్వహించి సుమారు 40 రకాల కల్తీ ఉత్పత్తులను గుర్తించింది. గోపాలపురం కల్లుమండవా సమీపాన ఉన్న స్టార్ బేకరీలో కల్తీ, కాలం చెల్లిన ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ బృందం గురువారం దాడులు నిర్వహించింది. కాలం చెల్లిన కూల్ డ్రింక్స్, బిస్కెట్స్, చాక్లెట్స్, కోకోనట్ బిస్కెట్స్, పల్లిపట్టీలు, కిసాన్ జాం, బఠాణీలు, నిమ్మకాయచట్నీ ప్యాకెట్స్, మిల్క్ షెక్స్‌లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.17వేలు ఉంటుందని, బేకరీ నిర్వాహకుడు అన్నారపు తేజాను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బేకరీ యజమానిని ఫుడ్ సెఫ్టీ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కల్తీ, కాలం చెల్లిన ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ హెచ్చరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఎస్సై ఓరుగంటి భానుప్రకాశ్, ఫుడ్ సెఫ్టీ అధికారులు బ్రహ్మాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాష నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల వెలికితీతకు దోహదం

విద్యారణ్యపురి: ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాల వెలికితీతకు దోహదం చేస్తాయని జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. గురువారం తెలంగాణ గణిత ఫోరం హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని సైన్స్ సెంటర్‌లో జిల్లా స్థాయి ప్రతిభా పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణితం రోజువారీ దినచర్యలో ఒక భాగంగా భావించాలన్నారు. ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో పరీక్షలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గణిత ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తౌటం భాస్కర్, ప్రధాన కార్యదర్శి బోయినపెల్లి మహేశ్‌కుమార్, కోశాధికారి పుల్లూరు మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి, ఇతర బాధ్యులు సతీశ్‌కుమార్, ఎంఈఓ నెహ్రూ, ఆనంద్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడిన సీఆర్‌పీఎఫ్ జవాన్

- చికిత్స పొందుతూ మృతి
- మృతుడిది పంజాబ్


అర్విందర్ సింగ్ (ఫైల్)

కాజీపేట రూరల్ : సెలవుపై ఇంటికి వెళ్లి తన కుటుంబం సభ్యులతో కొన్ని రోజులు సంతోషంగా గడిపి తిరిగి విధులకు రావొచ్చని ఎన్నో ఆశలతో ఇంటికి ప్రయాణమైన సీఆర్‌పీఎఫ్ జవాన్‌ను మృత్యువు కబలించింది. రైలు ప్రమాద రూపంలో అనంతలోకాలకు తీసుకెళ్లింది. కాజీపేట జంక్షన్‌లో బుధవారం సాయంత్రం ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ రైలు నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.భాస్కర్ కథనం ప్రకారం.. పంజాబ్ జలంధర్‌కు చెందిన హర్వీందర్‌సింగ్ (50) బెటాలియన్ –81, సత్యనారాయణపురం, చర్ల, భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో సీఆర్‌పీఎఫ్/హెచ్‌సీ–డీవీర్‌గా విధులు నిర్వస్తున్నాడు. సెలవుపై సొంతూరు పంజాబ్ వెళ్లేందుకు కొత్తగూడెం నుంచి కాజీపేట జంక్షన్‌కు రైలులో వచ్చాడు. జంక్షన్ నుంచి మరో రైలులో పంజాబ్‌కు వెళ్తుండగా 1వ నంబర్ ప్లాట్‌ఫాం చివరన లోకోపైలెట్ కార్యాలయం (లాబి)–రైల్వే యార్డు సమీపంలో రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు 108లో వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉంది. గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని భద్రాద్రి జిల్లా సీఆర్‌పీఎఫ్ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.భాస్కర్ తెలిపారు.

ఇంటి వద్దనే.. జీవనధ్రువీకరణ పత్రం!

- తపాలా శాఖ ఆన్‌లైన్ సేవలు
- జీవన ప్రమాన్ పత్రం జారీ
- బ్యాంకు, ఆధార్, పాస్‌పోర్ట్ సేవలు కూడా..
- విశ్రాంత ఉద్యోగులకు తపాలా శాఖ బాసట


వరంగల్ డివిజనల్ తపాలా శాఖ భవనం


విశ్రాంత ఉద్యోగి ఇంటి వద్ద ఆన్‌లైన్‌లో జీవన ధ్రువీకరణ పత్రం చేస్తున్న తపాలా సిబ్బంది

ఖిలా వరంగల్: విశ్రాంత ఉద్యోగులు తాము జీవించి ఉన్నామనే జీవన (ప్రమాన్ పత్రం) ధ్రువీకరణ పత్రాన్ని ఏటా నవంబర్, డిసెంబర్‌లో ట్రెజరీ కార్యాలయానికి అందించాల్సి ఉంటుంది. దీనికి రోజుల కొద్దీ బ్యాంకుల చుట్టు తిరగాల్సి ఉంటుంది. ఇది వ్యవ ప్రాసలు కలిగే అంశం. ఈ నేపథ్యంలో ఈ విధానాన్ని సులువు తరం చేసేందుకు తపాలాశాఖ నడుంబిగించింది. బ్యాంకులో లభించే సేవలను పోస్టాఫీస్‌ల్లో కూడా అందజేస్తోంది. ఇందులో భాగంగా విశ్రాంత ఉద్యోగులకు వారి ఇంటి వద్దనే డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తోంది. ఈ సేవలు అందించడానికి వరంగల్ జిల్లాలోని వరంగల్ డివిజన్ పరిధిలోని వరంగల్, మహబూబాబాద్ హెడ్‌పోస్టాఫీస్‌ల ద్వారా 42 పట్టణ, 364 గ్రామీణ తపాలాశాఖ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, బీడీ కార్మికులు, ఈపీఎఫ్ ద్వారా పింఛన్ పొందుతున్న వారందరికీ తపాలాశాఖ కొత్తగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ధ్రువీకరణ పత్రం పొందడమే కాకుండా ఆన్‌లైన్‌లో సంబంధిత కార్యాలయానికి క్షణాల్లో చేరుతోంది.దీంతో విశ్రాంత ఉద్యోగులు ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదు. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల వ్యాప్తంగా ఉన్న ట్రెజరీ కార్యాలయాల పరిధిలో సుమారు 40వేల మంది విశ్రాంతి ఉద్యోగులకు మేలు జరుగుతోంది.

డిజిటల్ సేవలు ఇలా..

విశ్రాంత ఉద్యోగుల ఇంటి వద్దే (జీవన ప్రమాన్ పత్రం) డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందించేందుకు వరంగల్ డివిజన్ వ్యాప్తంగా తపాలా శాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందుకు గాను సమాచారం ఇస్తే బ్రాంచ్ పోస్టాఫీస్‌లు, తపాలా కార్యాలయాల్లో డివైజ్ ద్వారా తపాలా సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్లి ఆధార్ బయోమెట్రిక్ ద్వారా విశ్రాంతి ఉద్యోగి వేలి ముద్ర తీసుకుని జీవన ధ్రువీకరణ పత్రాన్ని క్షణాల్లో ఆన్‌లైన్‌లో అందిస్తారు. వరంగల్ డివిజన్ తపాలాశాఖ 408 కార్యాలయాల ద్వారా ఈసేవలు అందిస్తోంది.

పత్రాలు కావాలంటే..

పింఛన్ ఐటీ, చెల్లింపు ఆర్డర్, పంపిణీ విభాగం, బ్యాంకు ఖాతా వివరాల నమోదుకు ఆన్‌లైన్‌లో రూ. 70 చెల్లించాల్సి ఉంటుంది. వేలిముద్ర ఆధారంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సంబంధిత కార్యాలయానికి చేరుతుంది. సంబంధిత విశ్రాంత ఉద్యోగి ఆన్‌లైన్ విజయవంతంగా సేవలు పూర్తయ్యాయనే సందేశం కూడా వస్తుందని వరంగల్ డివిజన్ సూపరింటెండెంట్ రవికుమార్ వివరించారు.

తపాలా సేవలపై అవగాహన కల్పిస్తున్నాం



తపాలాశాఖ ద్వారా మెరుగైన బ్యాంకు సేవలు అందిస్తున్నాం. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీలు చెల్లిస్తున్నాం. రూ.200తో ఖాతా తెరిచి బీమా పాలసీల సౌకర్యాలు కల్పిస్తున్నాం. తక్కువ ప్రీమియంతో లభించే పాలసీలను ప్రజలకు అందుబాటులో ఉంచాం. ఇప్పటికే స్పీడ్ పోస్ట్, దేశ, విదేశాలకు పార్సిల్ సౌకర్యాలు, బ్యాంకు, బీమా, ఆధార్, పాస్‌పోర్ట్, జీవన ధ్రువీకరణ పత్రం జారీ చేసే ప్రక్రియ విజయవంతంగా చేపడుతున్నాం.

–రవికుమార్, సూపరింటెండెంట్ తపాలాశాఖ, వరంగల్ డివిజన్

వేసవిలో వినియోగదారులకు ఇబ్బందులు కలగొద్దు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: వేసవిలో విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, ఆపరేషన్, టెక్నికల్, ఎమ్మార్టీ డీఈలు, ట్రాన్స్‌కో సీఈలు, ఎస్ఈలు, డీఈల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. వేసవి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సీఎండీ.. ఎస్ఈ, డీఈలను ఆదేశించారు. గత వేసవి విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్లు సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, అలాగే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల పెంపు వంటి పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడానికి లూజ్ లైన్లు సరిచేయాలని, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచాలని, ఎర్తింగ్ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, ట్రాన్స్‌కో సీఈ శ్రీరాం కుమార్, విజయ్ కుమార్, పాపారావు, డిస్కం సీఈలు కె.తిరుమల్ రావు, అశోక్, రాజు చౌహాన్, బీకంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


హోమంలో మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

కాటారం: ప్రజలు సంతోషంగా, సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. మంత్రి స్వగ్రామం కాటారం మండలం ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మంత్రి శ్రీధర్‌బాబు.. తన సతీమణి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యార్, తల్లి జయమ్మతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, హోమం జరిపించారు. అంతకుముందు ఆలయ అర్చకులు మంత్రి శ్రీధర్‌బాబు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ అధ్యక్షుడు చీటూరి మహేశ్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌కు నృత్య తపస్వి అవార్డు

- నేడు ఏలూరులో ప్రదానం

హన్మకొండ కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ 29వ వార్షికోత్సవ అంతర్జాతీయ నృత్య ఉత్సవంలో భాగంగా వరంగల్‌కు చెందిన ప్రముఖ పేరిణి నాట్య ఆచార్యుడు గజ్జెల రంజిత్‌కు అభినయ నృత్య భారతి ఏలూరు వారు భారత కళా ప్రపూర్ణ కోరాడ నరసింహరావు స్మారక నృత్య తపస్వి అవార్డు–2024ను ప్రకటించింది. ఈ మేరకు ఏలూరులోని శల నాగకోటేశ్వరావు కల్యాణ మంపడంలో హేలపురి లయన్స్ క్లబ్, సర్వీస్ ట్రస్ట్, లయన్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 316జీ, కర్ణ భక్తుల సేవా సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరగనున్న అంతర్జాతీయ నృత్యోత్సవంలో అతిథుల చేతుల మీదుగా గజ్జెల రంజిత్ ఈ అవార్డు అందుకోనున్నారు. 25 ఏళ్లుగా పేరిణి నాట్యాన్ని అందిస్తూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో రూపొందించిన మొదటి పేరిణి నృత్య రూపకం ప్రజాదారణ పొందిందని, ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని గజ్జెల రంజిత్ పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల బరితెగింపు..

- బ్యాంకు ఉద్యోగి అకౌంట్ల నుంచి రూ.1.15 లక్షలు మాయం


బాధితుడు ప్రతాప్

పాలకుర్తి టౌన్ : సైబర్ నేరగాళ్లు బరితెగించారు. ఏకంగా ఓ బ్యాంకు ఉద్యోగి అకౌంట్ల నుంచి రూ.లక్షా 15 వేలు మాయం చేశారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం కేంద్రంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకలతండాకు చెందిన లాకావత్ ప్రతాప్ పాలకుర్తిలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే బ్యాంకులో తనకు మూడు అకౌంట్లు ఉన్నాయి. వారం రోజుల క్రితం అదే బ్యాంకులో గోల్డ్‌లోన్ తీసుకోగా రూ.3 లక్షల 50 వేలు జమ అయ్యాయి. అయితే అక్కెర నిమిత్తం వారం క్రితం రూ. 2 లక్షల 50 వేలు తీసుకున్నాడు. మిగతా డబ్బులు తన అకౌంట్లలో ఉంచాడు. మంగళవారం రాత్రి తన మొబైల్‌లో బ్యాలెన్స్ చూసుకోగా డబ్బులు లేక పోవడంతో ఆందోళన చెందాడు. ఒక అకౌంట్‌లో రూ. వెయ్యి, మరో అకౌంట్‌లో రూ. 14వేలు, ఇంకొక అకౌంట్‌లో రూ. లక్ష మాయమయ్యాయి. తన డబ్బులు సైబర్ నేరగాళ్లు మాయం చేశారని నిర్ధారణకు వచ్చాడు. ఎలాంటి ఓటీపీ కూడా లేకుండా సైబర్ నేరగాళ్లు రూ.లక్షా 15 వేలు మాయం చేశారని లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తన బ్యాంకు ఖాతాలను సీజ్ చేయించుకున్నాడు.

రీజినల్ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

ఎంజీఎం: కేరళలో నిర్వహించిన రీజినల్ స్థాయి హెచ్ఐవీ, ఎయిడ్స్ క్విజ్ పోటీల్లో హనుమకొండ జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు డీఎంహెచ్ఓ అప్పయ్య తెలిపారు. ఈపోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు విధాత్రి, ఖలీముల్లా తృతీయ బహుమతి సాధించి రూ.2 వేల నగదు బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డీఎంహెచ్ఓ అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్, మేనేజర్ స్వప్నమాదురి ప్రత్యేకంగా అభినందించారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ సత్య శారద


కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రానున్న వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల హాజరు, మానసిక స్థైర్యం తదితర అంశాలపై కళాశాల యాజమాన్యాలు నిరంతరం సమీక్షించాలని, డ్రాపౌట్ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో మామునూరు ఏసీపీ తిరుపతి, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, డీఈఓ జ్ఞానేశ్వర్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, జిల్లా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ప్రభుత్వరంగ కళాశాలల రీజినల్ కోఆర్డినేటర్లు, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా వేర్‌హౌస్ గోదాముల్లో భద్రపర్చిన ఈవీఎంలను అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ సత్య శారద గురువారం తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రంజిత్, బీజేపీ, టీడీపీ, ఏఐఎంఐఎం పార్టీల ప్రతినిధులు హరిశంకర్, శ్యాంసుందర్, ఫైజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : జిల్లాలో ఈనెల 15, 16 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యాన నిర్వహించే గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఈ పరీక్షల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్లు, ఫొటో గుర్తింపులను పరిశీలించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను వివరించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవి, పరీక్షల రీజినల్ కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ సదానందం, ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్, కలెక్టరేట్ ఏఓ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో..

వరంగల్: జిల్లాలో గ్రూప్–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని 11,309 మంది అభ్యర్థులకు 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

విద్యార్థి అదృశ్యం


యశ్వంత్

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పీఎస్ పరిధి శివనగర్ ఏకశిల డీజీ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. శివనగర్‌కు చెందిన కుడ్ల శ్రీనివాస్ కుమారుడు యశ్వంత్ రోజువారీగా గురువారం ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లాడు. సబ్జెక్ట్ వారీగా పరీక్షలు రాశాడు. 3 గంటలకు ఎవరికీ చెప్పకుండా స్కూల్ నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి స్కూల్‌కు గాని ఇంటికి గాని చేరుకోలేదు. దీంతో విద్యార్థి యశ్వంత్ తండ్రి శ్రీనివాస్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ఛీకేఎం..

కంపు కొడుతున్న సీకేఎం ఆస్పత్రి

- ఆవరణలో పారుతున్న డ్రెయినేజీ నీరు
- కమిషనర్ ఆదేశించినా మారని తీరు
- రోగాల పాలవుతున్న గర్భిణులు


ఆస్పత్రి ప్రాంగణంలో పారుతున్న డ్రెయినేజీ నీరు

ఎంజీఎం: వరంగల్ జిల్లాలో పేద గర్భిణులకు వరప్రదాయినిగా ఉన్న సీకేఎం ఆస్పత్రి పాలన అస్తవ్యస్తంగా మారింది. కొన్ని నెలలుగా ఆస్పత్రిలో శానిటేషన్ వ్యవస్థ పూర్తి అధ్వానంగా మారింది. పేద గర్భిణులు ప్రసవ సేవల కోసం సుదూర ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికి వస్తుంటారు. కొన్ని నెలల నుంచి ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ వ్యవస్థ నిర్వీర్యమవడంతో ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన వారికి.. కొత్తగా రోగాలు వచ్చే పరిస్థితి నెలకొందని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపు.. దోమల విజృంభణ

సీకేఎం ఆస్పత్రిలో వైద్యచికిత్సలందించే భవనం పురాతనమైంది కావడంతో ఆస్పత్రి అంతా కిక్కిరిసిపోయి కనిపిస్తూ ఉంటుంది. ఈ భవన ప్రాంగణాన్ని డ్రెయినేజీ పైప్ లైన్ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించకపోయినా, శానిటేషన్‌ను మెరుగుపరుచకపోయినా ఆస్పత్రి ప్రాంగణమంతా మురుగుతో కంపుకొడుతుంది. ఈమధ్య కాలంలో ఆస్పత్రిలో శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా మారడంతో డ్రెయినేజీ నీరు ఆస్పత్రిలో ప్రాంగణంలోకి చేరి కంపు కొడుతోంది. ఈవాసనతో కనీసం అక్కడ నిల్చోలేని పరిస్థితి ఏర్పడిందని గర్భిణులు, అటెండెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత అధికారుల నిర్ణయం.. రోగులకు శాపం

సీకేఎం ఆస్పత్రి హెచ్‌డీఎస్ విభాగంలో పని చేస్తున్న పారామెడికల్ సిబ్బందికి శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల స్థానంలో జీతాలు చెల్లించేలా గత కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇదే ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్‌కు వరంగా మారింది. ఈనిర్ణయంతో శానిటేషన్, సెక్యూరిటీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. కార్మికుల స్థానంలో పారామెడికల్ సిబ్బంది విధులు నిర్వర్తించడం వల్ల సీకేఎం పరిపాలనాధికారులు కనీసం కాంట్రాక్టర్‌ను మందలించలేని దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో ఉండాల్సిన కార్మికుల స్థానంలో 15 నుంచి 20 మంది వరకు టెక్నికల్ సిబ్బందిని కొనసాగిస్తూ ఆస్పత్రి శానిటేషన్ వ్యవస్థను అధ్వానంగా మార్చేశారు. గత కొన్ని రోజుల క్రితం ఆరోగ్యశాఖ కమిషనర్ కర్ణన్ సందర్శించిన సమయంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేసి మెరుగుపర్చేలా చర్యలు చేపట్టాలని వరంగల్ డీఎంహెచ్ఓ సాంబశివరావును ఆదేశించారు. అయినప్పటికీ.. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆస్పత్రి నిర్వహణ పూర్తి అధ్వానంగా మారింది.

కలెక్టర్ దృష్టి సారించాలి..

ఆస్పత్రిలో అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. ముక్కు మూసుకుని సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. గర్భిణులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి మురుగులో కాలు వేసినా జారిపడే ప్రమాదం ఉంది. సీకేఎం ఆస్పత్రిలో చికిత్సలు పొందే గర్భిణుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్న క్రమంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్ప ఆస్పత్రి సేవలు మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదని గర్భిణులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆస్పత్రి పాలనపై దృష్టి సారించాలని వారంతా వేడుకుంటున్నారు.

వేతన వెతలు..



- ఐదునెలలుగా విడుదలకాని వేతనాలు
- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులు

విద్యారణ్యపురి : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రభుత్వం ఐదునెలలుగా వేతనాలు విడుదల చేయడం లేదు. దీంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆయా అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులు, అధ్యాపకులకు ప్రభుత్వం ప్రతినెలా ఒకటవ తేదీనే వేతనాలు విడుదల చేస్తోంది.అయితే కాంట్రాక్టు అధ్యాపకులకు నెలలు గడిచినా వేతనాలు విడుదల చేయకపోవడంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు అధ్యాపకులకు రెగ్యులరైజ్ చేసినప్పటికీ ఒకేషనల్ కోర్సులు బోధించే రాష్ట్రంలో సుమారు 411మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50మందికిపైగా ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో ఐదునెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడంతో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారని ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు పేర్కొంటున్నారు. వేతనాలు విడుదలచేసేలా సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరుతున్నారు. ఒక్కో కాంట్రాక్టు అధ్యాపకుడికి నెలకు వేతనం రూ. 54వేల 220 చొప్పున చెల్లించాల్సింటుంది. తాము చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా ఐదునెలలుగా జీతాలు విడుదల చేయకపోతే ఎలా అని కాంట్రాక్టు అధ్యాపకులు పేర్కొంటున్నారు.

రెండు నాగళ్లతో సాలు



రైతులు సాధారణంగా ఒక్క నాగలితోనే పంట సాలు దున్నుతారు. అయితే.. యాసంగి మొక్కజొన్న పంట వేయడానికి వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం సూర్యాపేట తండాకు చెందిన రైతు ధారావత్ బిచ్యా తన వ్యవసాయ భూమిలో రెండు దుక్కిడెద్దులు రెండు నాగళ్లు కట్టి ఒకేసారి రెండు సాళ్లు దున్నుతున్న దృశ్యం'సాక్షి' కెమెరాకు చిక్కింది. ఇలా చేయడం వల్ల సమయంతోపాటు శ్రమ తగ్గుతుందని రైతు పేర్కొన్నాడు.

– చెన్నారావుపేట

బాలికల గురుకులంలో బీభత్సం

- క్రిస్మస్ వేడుకలు అడ్డుకుని విద్యార్థినులపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి
- ఫర్నిచర్ ధ్వంసం.. ఇద్దరికి స్వల్పగాయాలు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


గురుకులంలో దాడి చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బీభత్సంంతు సృష్టించారు. రాత్రి వేళ పురుషులకు అనుమతి లేకున్నా చొరబడి విద్యార్థినులపై దాడి చేయడంతోపాటు ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.50వేల విలువైన ఫర్నిచర్ ధ్వంసమైనట్లు ప్రిన్సిపాల్ ఇందుమతి తెలిపారు. క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న క్రమంలో కొంతమంది వ్యక్తులు లోపలికి ప్రవేశించి విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేశారని ఆమె పేర్కొన్నారు. కళాశాలలో ఏటా అన్ని మతాలకు సంబంధించిన వేడుకలు నిర్వహిస్తున్నామని, క్రిస్మస్‌ను పురస్కరించుకుని విద్యార్థినులు వేడుకలు నిర్వహిస్తుండగా 20 మంది గుర్తు తెలియని వ్యక్తులు(ఇందులో ముగ్గురు యువతులు ఉన్నారు) వచ్చి మత ప్రచారంచేస్తున్నారంటూ అధ్యాపకులతో వారు వాగ్వాదానికి దిగారని ప్రిన్సిపాల్ తెలిపారు. వాగ్వాదంతో ఆగకుండా గుర్తుతెలియని వ్యక్తులు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని, వారు చేసిన దాడుల్లో విద్యార్థినులు వైష్ణవి, గీతాంజలి, రేణుకతో పాటు మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయని వివరించారు. ఈ విషయమై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి వచ్చే ముందే విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు విద్యార్థినులు తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కె.ఆదిత్య, డి.బిక్షపతి, ప్రకాశ్, నాగరాణి, ఝాన్సీ రాణితోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.